క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సన్యాసినాయుడు

పరవాడ: మండలంలోనిరావాడ శివారు గొల్లగుంట గ్రామంలో జరుగుతున్న డ్రైనేజీ పనులను సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు బుధవారం పరిశీలించారు. పంచాయతీ సాధారణ నిధులు రూ.8 లక్షలతో గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించి మురుగు నీరు సజావుగా దిగువకు వెళ్లేలా నిర్మాణ పనులు జరపాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామంలో ముస్లిం మహిళలు నమాజ్ చేయడానికి అవసరమైన కమ్యూనిటీ భవనం మరమ్మతులకు చర్యలు చేపట్టాలని సర్పంచ్‌ను గ్రామస్తులు కోరారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి రిపేర్లను పూర్తి చేసేందుకు అంచనాలు తయారు చేయాలని అధికారులను సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అనురాధ, వార్డు సభ్యులు సైరాబేగం, కాంట్రాక్టర్ సోమేష్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

'సాయినార్' పరిశ్రమ తెరిపించండి



అర్ధంతరంగా మూసివేసిన సాయినార్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలో సాయినార్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమను యాజమాన్యం అర్ధంతరంగా మూసివేసి, కార్మికులను రోడ్డుపాలు చేసిందని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. పారిశ్రామిక విధానాల చట్టం ప్రకారం ముందస్తు అనుమతులు లేకుండా పరిశ్రమను మూసివేయడం చట్టరీత్యా నేరమన్నారు. యాజమాన్యాన్ని ప్యాసిక్యూషన్ చేసి అక్రమ మూసివేతకు పాల్పడినందుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల భవిష్యత్ దృష్ట్యా పరిశ్రమను తెరిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్ పరిణామాలకు ప్రభుత్వ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికునికి గండి రవి పరామర్శ



రామును పరామర్శిస్తున్న గండి రవికుమార్, పార్టీ స్థానిక నాయకులు

సబ్బవరం: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని మల్లునాయుడుపాలెం వలంటీర్ దొమ్మిసి సతీష్ తండ్రి, పారిశుధ్య కార్మికుడు దొమ్మిసి రామును వైఎస్సార్‌సీపీ నాయకుడు గండి రవికుమార్ బుధవారం పరామర్శించారు. పక్షవాతంతో బాధపడుతూ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఆయన్ని ఇంటికెళ్లి పరామర్శించి, మందుల ఖర్చుల కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, ఐడీ బాబు, కరక రాము, గురి శ్రీనివాస్, సిరపరపు శ్రీను, గోతిరెడ్డి అమ్మతల్లి, బత్తిన వెంకట్, కోటి, బంకపల్లి శంకర్ తదితరులున్నారు.

ఫ్లోరోసిస్ బారినపడి బతుకులు దుర్భరం

నీటిలో ఉండాల్సిన ఫ్లోరైడ్ 1-1.5 పీపీఎం/మి.గ్రా.

చాలా గ్రామాల్లో అంతకు మించి ఫ్లోరైడ్

దీర్ఘకాలిక ఎముకల సమస్యతో ప్రజలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జేజేఎం పనులతో కాస్త ఊరట



ఇతని పేరు పిల్లల అప్పారావు. సబ్బవరంలోని రాయపుర అగ్రహారానికి చెందిన వ్యక్తి. వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబానికి ఇతోధికంగా సాయపడేవాడు. ఇద్దరు కొడుకులు, ఓ కూతురు. అందరికీ పెళ్లి చేశారు. ప్రస్తుతం విపరీతమైన కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. ఎక్కడికి వెళ్లాలన్నా వేరొకరిపై ఆధారపడాల్సిందే. మోకాళ్లు పూర్తిగా మెలితిరిగి, నడిచేందుక్కూడా ఇబ్బందులు పడుతున్నాడు. యుక్తవయసులో బాగానే ఉండేది. వయసు పెరుగుతున్నకొద్దీ ఎముకలు మెలి తిరిగిపోతున్నాయి. చాలా మంది వైద్యులకు చూపించి, మందులు వాడినా నయం కావట్లేదు. వ్యవసాయ పనులు చేసుకునే తాను.. ప్రస్తుతం నడిచేందుకూ ఇబ్బంది **పడుతుండటంతో ఇంటి దగ్గరే కూలబడిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.**

బతుకు మారదు.. చావు దరిచేరదు!



అంతకాపల్లి పంచాయతీలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు

సబ్బవరం: మానవ శరీరం సజావుగా సాగాలంటే కావాల్సిన విటమిన్లు, మినరల్స్ తదితరాలన్నీ సమపాళ్లలో అందాలి. కొంచెం అటూఇటైతే తీవ్ర సమస్యలు ఎదుర్కొనాల్సిందే. దేహానికి అవసరమైన అనేక ఖనిజ లవణాల్లో ఫ్లోరైడ్ కూడా ఒకటి. ఇది ఎక్కువైనా, తక్కువైనా ప్రమాదమే. భూగర్భ జలాలు, భూపొరలు, కొన్ని రకాల రాళ్లలో ఇది ఉంటుంది. భూగర్భ జలాల ద్వారా మన శరీరంలోకి చేరుతుంది. మండలంలోని పలు ప్రాంతాల భూగర్భ జలాల్లో స్థాయిని మించి ఫ్లోరైడ్ ఉండటంతో.. ఆయా ప్రాంతాల ప్రజలు దీర్ఘకాలిక ఇబ్బందులకు గురవుతున్నారు. దైనందిన జీవనం దుర్భరంగా మారిన బాధితులు, ఆ నొప్పిని భరించలేక మరణమే శరణ్యమనుకుంటున్నారంటే అతిశయోక్తి కాదు.

క్రమేపీ ముంచేస్తుంది..!

ఫ్లోరోసిస్ వ్యాధి ఒక్కసారిగా బయటపడదు. క్రమేపీ పెరుగుతూ దీర్ఘకాలంలో బయటపడుతుంది. వీరిలో దంతాలు గారపట్టి, తీవ్రంగా దెబ్బతినడం, ఎముకలు పటుత్వాన్ని కోల్పోయి, వంకర్లు తిరగడం, కీళ్ల నొప్పులు పెరుగుతాయి. యుక్త వయసులోనే వృద్ధాప్య చాయలు అలముకుంటాయి. తీవ్రమైన నొప్పులతో పూర్తిగా మంచానికే పరిమితమైన వాళ్లు చాలా మంది. మండలంలోని అంతకాపల్లి, రావలమ్మపాలెం, ఒమ్మివానిపాలెం, వంగలి, టిక్కలిపాలెం, ఆసకపల్లి, టి.జంగాలపాలెం, తెలుకులపాలెం, రాయపుర అగ్రహారం గ్రామాల ప్రజలు ఫ్లోరైడ్ సమస్యతో తీవ్రంగా బాధపడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా రక్షిత తాగు నీటిని అందించి, ఈ సమస్యను అధిగమించవచ్చని నిపుణులు చెప్తున్నారు.

> **భారత్‌లో తొలి కేసు**
>
> భారత్‌లో తొలి ఫ్లోరోసిస్ కేసు 1937లో నమోదైంది. బ్రిటీష్ పాలనలో అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో భాగమైన పొదిలి, దర్శి(ప్రస్తుత ప్రకాశం జిల్లా) ప్రాంతాల్లో గుర్తించారు. ఆ తర్వాత 33 ఏళ్లకు ప్రకాశం జిల్లా ఏర్పడింది.

పరి'మితం' దాటితే ప్రమాదం

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాల ప్రకారం మనం తాగే నీటిలో లీటరుకు 1 నుంచి 1.5 మి.గ్రా. వరకు ఫ్లోరైడ్ ఉండొచ్చు. అంతకు మించి ఉంటే ఆరోగ్యానికి ప్రమాదం. ఫ్లోరోసిస్‌ను ఒకటి రెండు రోజుల్లోనో.. వారం పది రోజుల్లోనో గుర్తించలేం. దీని లక్షణాలు మెల్ల మెల్లగా బయటపడతాయి. దంతాలు, ఎముకలపై లక్షణాలు కనిపిస్తాయి. ఎక్కువ మోతాదులో ఫ్లోరైడ్ శరీరంలోకి చేరినప్పుడు కిడ్నీలపై ఆ ప్రభావం పడుతుంది. అధికంగా ఉన్న ఫ్లోరైడ్‌ను బయటకు పంపేందుకు కిడ్నీలు మరింతగా శ్రమించాల్సి వస్తాయి. దంతాలు, ఎముకలు, కిడ్నీలతోపాటు కాలేయంపై కూడా ఫ్లోరైడ్ ప్రభావం చూపుతుంది. మండలంలో ఎక్కువగా డెంటల్, స్కెలెటల్ ఫ్లోరోసిస్ బాధితులు ఉన్నారు. న్యూరల్ ఫ్లోరోసిస్ ప్రభావం ఇక్కడ పెద్దగా లేదు.



ఫ్లోరోసిస్ వల్ల కాళ్లు వంకరపోయిన రాజాన రమణ

ఫ్లోరోసిస్ బాధిత గ్రామాల్లో కొన్ని

గ్రామం పేరు	ఫ్లోరైడ్ (లీ/మి.గ్రా.)
వంగలి	2.05
రావలమ్మపాలెం	1.88
అసకపల్లి	1.84
మొగలిపురం	1.81
ఒమ్మవానిపాలెం	1.79
తెలుకులపాలెం	1.78
అంతకాపల్లి	1.71

జేజేఎంతో కాస్త ఊరట



మా గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉంది. దీంతో ప్రస్తుతం ప్రాజెక్ట్ వాటర్‌ను గ్రామంలో తాగు నీటి కొళాయిల ద్వారా అందిస్తున్నారు. గతంలో అధిక సంఖ్యలో ప్రజలు పలు రకాల కీళ్ల సంబంధిత వ్యాధులతో బాధపడేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జల్ జీవన్ మిషన్(జేజేఎం) ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకు, ఇంటింటికీ కొళాయిలను ఏర్పాటు చేసి, తాగునీటి సరఫరా ప్రారంభించారు. దీంతో కొంత వరకు ప్రజలకు మేలు జరుగుతోంది.

– మేడపురెడ్డి నారాయణమూర్తి, రావలమ్మపాలెం, సబ్బవరం మండలం

రక్షిత తాగునీరందిస్తున్నాం



ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉన్న అంతకాపల్లి, రావలమ్మపాలెం, అసకపల్లి గ్రామాల్లో సమగ్ర తాగు నీటి సరఫరా పథకం(సీపీడబ్ల్యూఎస్) ద్వారా మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నాం. వంగలి గ్రామంలో కొత్తగా జేజేఎం నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి ప్రత్యామ్నాయంగా బోర్ ఏర్పాటుచేసి తాగునీటిని అందిస్తున్నాం. టిక్కలిపాలెం పరిసర గ్రామాల్లో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నాం.

–డి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సబ్బవరం మండలం

'స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి'



జీపుజాతాలో ప్రసంగిస్తున్న లోకనాథం

పరవాడ: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ నుంచి నెల్లూరు వరకు సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాత కార్యక్రమానికి లంకెలపాలెం కూడలిలో కార్యకర్తలు బుధవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ కాకుండా ప్రైవేటీకరణ చేయబోమని స్పష్టమైన ప్రకటన చేయాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్యాకేజీ కింద రూ.11,400 కోట్లు ఇచ్చి స్టీల్ ప్లాంట్‌ను అదానీకి విక్రయించాలని చూస్తున్నారని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా 40 వేల ఉద్యోగాలు వస్తాయని, ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి మెరుగుపడుతుందన్నారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర మహాసభల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు ఎం.రామారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కర్లం వెంకటరావు, డి.దేముడు, శ్రీను, రాము, నూకరాజు పాల్గొన్నారు.

'మత్తు'తో జీవితాలు చిత్తు



విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న పెందుర్తి సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాల వాడకంతో జీవితాలు నాశనమవుతాయని పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. బుధవారం నరవలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'యాంటీ డ్రగ్స్'అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యుక్త వయసులో తెలిసీ తెలియక డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారంలాంటి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలన్న సంకల్పంతో ముందడుగు వేయాలన్నారు. అనుకున్న లక్ష్యం కోసం అహర్నిశలు శ్రమించి, తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం పాడుచేసుకోవడంతో పాటు సమాజంలో చులకన అవుతారని హెచ్చరించారు. సానుకూల దృక్పథంతో ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని, జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌సీడీసీతో 'కుష్టు' ముందస్తు గుర్తింపు



సర్వేను పరిశీలిస్తున్న సెంట్రల్ లెప్రసీ డైరెక్టర్ డాక్టర్ విజయకుమారన్, డాక్టర్ భాగ్యజ్యోతి

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) కార్యక్రమాన్ని సెంట్రల్ లెప్రసీ డైరెక్టర్ డాక్టర్ విజయకుమారన్, డాక్టర్ భాగ్యజ్యోతి బుధవారం పర్యవేక్షించారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2 వరకు 14 రోజుల పాటు ఈ ఎల్‌సీడీసీ సర్వే నిర్వహించనున్నారు. మండలంలోని పలు గ్రామాలల్లో చేస్తున్న ఇంటింటి సర్వే తీరును పరిశీలించారు. స్థానిక ఆశా కార్యకర్తలు, వలంటీర్ల పని తీరును పర్యవేక్షించారు. పీహెచ్‌సీకి సంబంధించిన లెప్రసీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన లెప్రసీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, అనకాపల్లి జిల్లా లెప్రసీ అధికారి ఎంవీ ఎస్‌కే బాలాజీ, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణతో పాటు గురుకుల పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత

• ఎంవీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు



మాట్లాడుతున్న సీనియర్ ఎంవీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు

అగనంపూడి: రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, వాహనచోదకులపై కూడా ఉందని సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, పరిమిత వేగంతో ప్రయాణించడం వాహనచోదకుల బాధ్యత అన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై మాత్రమే పోలీసులు దృష్టి సారించగలరన్నారు. అదుపుతప్పిన వేగం, హెల్మెట్ ధరించకుండా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడమే ప్రమాదాలకు ఎక్కువగా కారణం అవుతున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, కోఆర్డినేటర్ పిన్నింటి సన్యాసిరావు, డీన్ బి.సతీష్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 11 మందికి చెరో రూ.10 వేలు చొప్పున కోర్టు రూ.1.10 లక్షల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. బుధవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌లో దేవీప్రసాద్ ప్రతిభ



దేవీప్రసాద్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి విజయవాడలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ మార్చ్‌పాస్ట్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ బుధవారం మీడియాకు తెలిపారు. గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దేవీప్రసాద్ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవంలో భాగంగా నిర్వహించిన రిపబ్లిక్ పరేడ్–2025లో ఈ ఘనత సాధించారన్నారు. దేవీప్రసాద్‌ను గురుకుల పాఠశాలలో పీడీ ప్రసాద్, పీఈటీ సూర్యనారాయణతో పాటు పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక సందర్శన



అక్కిరెడ్డిపాలెంలో సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు బుధవారం అక్కిరెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం సచివాలయంతో పాటు ములగాడ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంఆర్ – 1, ఎంఆర్ – 2 బ్యాక్‌లాగ్స్ గురించి, ఓపీ, ఐపీ సేవలు, ఆర్‌కేఎస్ మొదలైన కార్యక్రమాలపై మెడికల్ అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ హాజరు విధిగా వేయాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. అభ ఐడీ మ్యాపింగ్ శతశాతం సాధించాలని ఆదేశించారు.

మెయిన్‌డ్రా టెన్నిస్ పోటీలు ప్రారంభం



డ్రాప్ షాట్ చేస్తున్న నగేష్



బంతిని రిటెన్ చేస్తున్న సౌమిత్రి

విశాఖ స్పోర్ట్స్: ఆలిండియా సీనియర్ టెన్నిస్ టోర్నీ(ఐస్టా) మెయిన్ డ్రా పోటీలు గురువారం ఆఫీసర్స్ క్లబ్‌లో ప్రారంభమయ్యాయి. సీనియర్స్ ర్యాంకింగ్ ఆటగాళ్లతో పాటు క్వాలిఫైయింగ్ రౌండ్లలో అర్హత సాధించిన వారు 35+–75+ వరకు ఐదు కేటగిరిల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీపడుతున్నారు. అండర్ 45+లో హోరాహోరీగా సాగిన రెండో రౌండ్ బి.నవీన్, కెఆర్‌కే కుమార్‌లు చెరో ఎనిమిదేసి పాయింట్లతో సమఉజ్జీగా నిలవగా టై బ్రేక్‌లో నవీన్ విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. మరో పోటీలో క్వాలిఫైయర్‌తో తలపడిన శంకర్‌నాయుడు 9–4తో విజయం సాధించాడు. 35+లో నితీష్ జాక్సన్‌తో కిరోన్ సమఉజ్జీగా నిలవగా టై బ్రేక్‌లో కిరోన్ విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాడు. పి.అనిల్‌పై వై.సురేష్, దీపు చంద్రపై సచిన్‌శర్మ, అమిత్‌రెడ్డిపై రెండో సీడ్ కర్నన్‌సేతు విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరుకోగా నగేష్ సునాయాసంగానే నగేష్‌రెడ్డిపై విజయం సాధించాడు. 55+లో గంగాధర్‌పై శివషణ్ముగం, మహేష్ కేశవ్‌పై రమేష్ విజయం సాధించగా టాప్ సీడ్ సుధాకర్‌రెడ్డి 9–2తో లూయిస్‌పై విజయం సాధించాడు.

భైరవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



భైరవస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



ఆలయం వద్ద భక్తుల కోలాహలం

• విశేషంగా పుష్య బహుళ అమావాస్య అభిషేకాలు

సింహాచలం: పుష్య బహుళ అమావాస్య సందర్భంగా భైరవవాకలోని భైరవస్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము 4 గంటల నుంచే ఆలయానికి చేరుకుని స్వామికి విభూదితో అభిషేకాలు చేశారు. అమృతకలశాలు సమర్పించారు. ప్రధాన రహదారిని ఆనుకుని ఆలయానికి వెళ్లే సుమారు రెండు కిలోమీటర్ల మార్గం రద్దీగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం సిబ్బంది, గార్డులు విధులు నిర్వర్తించారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోండి



పాడిరైతులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అరుణ, తదితరులు

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యులు డాక్టర్ జి.అరుణ తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం, ఎల్లుప్పి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఈ శిబిరాలను సర్పంచ్ మోపాడ అప్పారావు ప్రారంభించారు. వైద్య శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న 26 పాడి పశువులకు వైద్య పరీక్షలు జరిపారు. 32 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సను అందించారు. 24 చూడి ఆవులకు తనిఖీలు చేశారు. 64 లేగదూడలకు, గ్రామంలోని గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.స్వర్ణలత, డాక్టర్ బి.సంధ్య, వెటర్నరీ అసిస్టెంట్ శివ, పశుసంవర్ధక శాఖ సహాయకులు సీహెచ్ అప్పలరాజు, కె.వెంకటరావు, ఎ.రమేష్, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులపై పెరిగిన దాడులు

• బొల్లవరపు జాన్ వెస్లీ



క్రైస్తవ గీతాల డీవీడీ విడుదల చేస్తున్న జాన్‌వెస్లీ

సీతమ్మధార: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని, అందరం కలిసి ఎదుర్కొందామని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. గురుద్వార దగ్గర గల ఎన్‌సీకే క్రైస్ట్ చర్చిలో బుధవారం నేషనల్ ఇండిపెండెంట్ బిషప్ కౌన్సిల్ (నిబ్) 24వ రాష్ట్రస్థాయి క్రైస్తవ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎన్ఐబీ ఫౌండర్, అధ్యక్షుడు కాట్రగడ్డ మార్టిన్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లో నిబ్ ఆధ్వర్యంలో చేసిన సేవలను వివరించారు. రెవరెండ్ మార్టిన్ లూథర్ దామెర మాట్లాడుతూ ఏసు దైవ గుణాలను, క్రైస్తవ్యం సిద్ధాంతాలను ఏ విధంగా అనుసరించాలో తెలియజేశారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ క్రైస్తవ్యం అంటే కృతజ్ఞతకు చిహ్నం అని అన్నారు. ఈనెల 26న శ్రీకాకుళం జిల్లా సోంపేటలో కల్వర్ బాప్టిస్ట్ చర్చి సభ్యులపై జరిగిన దాడి, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో పాస్టర్ చింతాడ రాజారెడ్డిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా క్రైస్తవులందరూ తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. క్రైస్తవ సంఘ కాపరులకు 8 నెలలుగా గౌరవ వేతనం, జెరూసలేం వెళ్లే యాత్రికులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయాలన్నారు. అనంతరం క్రైస్తవ గీతాల డీవీడీని జాన్ వెస్లీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అతిథులను సత్కరించారు. రెవరెండ్ ఎం.ఎ. పాల్, నిబ్ ఏపీ సెక్రటరీ బిషప్ ముక్తిపూడి సత్యకిరణ్, ఎం.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.